క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



డోర్నకల్ : మండలంలోని ఉయ్యాల వాడకు చెందిన పసునూటి వీరయ్య తన సెల్‌ఫోన్ పోయిందని పోలీసులకు ఫిర్యాదు చేయగా సాంకేతిక పరిజ్ఞానంతో దానిని గుర్తించి గురువారం బాధితుడికి అందించినట్లు డోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఐ సూచించారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



తొర్రూరు రూరల్ : మండలంలోని ఆయా గిరిజన తండాల్లో వరంగల్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు చేశారు. అమర్‌సింగ్ తండా, భీముడి తండా, దుబ్బ తండా, సారా తండా, మంగ్లీ తండాల్లో అక్రమంగా నిల్వచేసిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, నల్లబెల్లం, పటిక, గుడుంబా స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి నాగేందర్‌రావు తెలిపారు. ఎక్సైజ్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, పవన్, నీరజ, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

డోర్నకల్ : స్థానిక జెడ్పీటీసీ పాడిశెట్టి కమలారామనాథం బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సీరోలు మండలం మన్నెగూడెంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

రాజీనామా స్వీకరించడం లేదు

కురవి : బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి గ్రామ శాఖ అధ్యక్షుడికి పంపిస్తే స్వీకరించడం లేదని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు ఎర్రంరెడ్డి సుధాకర్‌రెడ్డి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. నల్లెల్ల గ్రామ శాఖ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కృష్ణమూర్తికి తన రాజీనామా పత్రాన్ని పంపించానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తన రాజీనామాకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. కాగా సుధాకర్‌రెడ్డిని బహిష్కరిస్తున్నట్లు బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కృష్ణమూర్తి ప్రకటనలో పేర్కొన్నారు.

బీఎస్పీతోనే రాజ్యాంగానికి రక్షణ

గూడూరు: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి రక్షణ ఒక్క బీఎస్పీతోనే సాధ్యమవుతుందని జిల్లా ఇన్‌చార్జ్ దార ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీఎస్పీ ఎంపీ అభ్యర్థి కోనేటి సుజాతను గెలిపించాలని పార్టీ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేసి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో నాయకులు ఈసంపెల్లి ఉపేందర్, గులగట్టు హేమంత్, నాగరాజు, రాంబాబు, సచిన్ పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపిక



వర్షిత్

గార్ల : మండలంలోని పోచారం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న కొండమీది వర్షిత్ కరీంనగర్ జిల్లాలోని సైనిక్ స్కూల్‌లో సీటు సాధించి గురువారం అడ్మిషన్ పొందాడు. సైనిక్ స్కూల్‌లో సీటు సాధించిన వర్షిత్‌ను తల్లిదండ్రులు కోటేశ్వరరావు, ధనమ్మ, హెచ్‌ఎం మాలోత్ భాస్కర్, గ్రామస్తులు అభినందించారు.

ఒండ్రు మట్టితో..భూసారం

- పంట పొలాలకు జవసత్వం
- అధిక దిగుబడికి అవకాశం



చెరువు నుంచి ఒండ్రుమట్టిని తరలిస్తున్న రైతులు

దంతాలపల్లి : పూర్వం చెరువులోని ఒండ్రు మట్టి(నల్లరేగడి) రైతులు వేసవిలో తమ పంట చేన్లలో, పొలాల్లో పోసుకొని అధిక లాభాలు పొందేవారు. ఎండాకాలంలో చెరువుల్లో నీరు ఎండిపోయినప్పుడు రైతులు తమకు అందుబాటులో ఉన్న చెరువులు, కుంటల నుంచి ఎడ్ల బండ్ల సాయంతో తమ పంటపొలాల్లో, చేన్లలో ఒండ్రుమట్టి పోసుకుని అనేక ప్రయోజనాలు పొందేవారు. కానీ ప్రస్తుతం ఈ పద్ధతి పాటించే వారు కరువయ్యారు. ఒండ్రు మట్టి పంట భూములకు ఔషధంలా పనిచేస్తుందని గుర్తు చేస్తున్నారు వ్యవసాయ అధికారులు. వర్షాలు పడ్డప్పుడు చెరువులో చేరే నీటితో పాటు సారవంతమైనా పోషక విలువలు కలుస్తాయి. నీళ్ల తగ్గుతున్న క్రమంలో చెరువులో ఒండ్రు పేరుకుపోతుంది. ఈ మట్టిని పొలాలలో వేయడం వల్ల అందులో ఉండే పోషకాలు, నత్రజని శాతం పెంచి భూమిని సారవంతం చేస్తాయి. చెరువు మట్టి లోతును బట్టి అందులోనూ పోషకాలు ఉంటాయి. భూమికి పోషణ తత్వాలతో పాటు పురుగు మందుల అవశేషాలు కలిసి ఉంటాయంటున్నారు. మట్టి పోసే ముందు భూసార పరీక్షలు చేయిస్తే మంచిది. ఇలా రెండు, మూడేళ్లకు ఒకసారి చెరువు మట్టి పోసినట్‌లైతే వర్షాలతో మట్టి కొట్టుకుపోయిన భూముల్లో తిరిగి మట్టి చేరుతుంది. పోసిన మట్టిని చదును చేసి దున్నడంతో భూసారం పెరుగుతుంది. దీంతో విత్తనాలు ఏపుగా పెరిగి మొక్క ఆరోగ్యంగా ఉంటుంది. ఈ మట్టితో పాటు పశువుల పేడ, తదితర సేంద్రియ ఎరువులు వాడడం మూలంగా భూమి గుల్లబారి తటస్థంగా ఉంటుంది. అంతే కాకుండా కరువు, వర్షాభావ పరిస్థితులను కూడా ఎదుర్కొనే శక్తి భూమికి ఇస్తుంది. భూముల్లో సారవంతం పెరిగి రసాయన ఎరువుల వాడకం తక్కువై భూమిని కాపాడుకోవచ్చు. దీంతో పాటు రైతుల దగ్గర ఉన్న సేంద్రియ ఎరువులు భూమిలో పోసినట్లైతే అధిక దిగుబడి పెరిగే అవకాశం ఎక్కువ. చెరువుల్లో మట్టిని తీయడం వల్ల చెరువు లోతు ఏర్పడి నీటి సామర్థ్యం పెరుగుతుంది. రైతులు తమకు అందుబాటులో ఉన్న చెరువులు, కుంటలలో మట్టిని తోలుకొని తమ భూములను సారవంతం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు.

తడి నిల్వ ఉంటుంది



పొలంలో ఒండ్రు మట్టి పోసుకోవడం వల్ల తడి ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. పత్తి, పసుపు పంటలకు ఇది చాలా మేలు చేస్తుంది. ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా చెరువులలో తీసిన మట్టిని కొంత మంది రైతులు సొంత కిరాయి చెల్లించి తరలిస్తున్నారు. మట్టి తరలించేందుకు ప్రభుత్వమే కిరాయి చెల్లించి, అవగాహన కల్పించాలి. దీంతో చాలా మంది రైతులు మట్టి తరలించేందుకు ముందుకు వస్తారు. **- జనిగల బజార్, రైతు, బొడ్లాడ**

భూసారం పెరుగుతుంది



ఒండ్రు మట్టిలో నత్రజని, ఆమ్ల, క్షార గుణాలు ఉండడంతో తడి పెరుగుంది. ప్రతి పంటకు పోషక విలువలు అధికంగా పెరుగుతాయి. భూమికి ఎలాంటి సమస్య రాకుండా భూసారం పెరుగుతుంది. దీంతో అధిక దిగుబడి సాధించవచ్చు. **- గాడిపెల్లి సందీప్, వ్యవసాయ విస్తరణ అధికారి**

'ఫాసిస్టు శక్తులను ఓడించాలి'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్ : ఎంపీ ఎన్నికల్లో మతోన్మాద ఫాసిస్టు శక్తులను ఓడించి లౌకిక శక్తులను గెలిపించాలని టీపీజేఏసీ రాష్ట్ర కన్వీనర్ మైస శ్రీనివాసులు, సీపీఎం ఫ్లోర్ లీడర్ సూర్ణపు సోమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని గుమ్ముడూర్‌లో గురువారం టీపీజేఏసీ ఆధ్వర్యంలో కరపత్రాలను సీపీఎం ఫ్లోర్ లీడర్ సోమయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రప్రభుత్వం పదేళ్లుగా చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజలను వంచించిదన్నారు. దేశంలో మతాల మధ్య విద్వేషాలు పెంచుతూ, దళితులు, మైనార్టీల మహిళల పట్ల దాడులు జరుగుతున్నా అరికట్టలేక పోతుందన్నారు. అందుకే ఫాసిస్టు శక్తులను ఓడించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు కుర్రా మహేష్, కిరణ్, నరేష్, సీపీఎం నాయకురాలు సూర్ణపు సావిత్రి, సమ్మెట రాజమౌళి, వీరస్వామి, రాజు, రఘు, విజయ, వసత, ఉమ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు డాక్టరేట్

మరిపెడ రూరల్: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని బొత్తలతండాకు చెందిన బోడ శ్రీనివాస్ కాకతీయ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఫిజిక్స్ సబ్జెక్ట్‌లో ప్రొఫెసర్ బి.వెంకట్రాంరెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా బోడ శ్రీనివాస్‌ను తండా వాసులు, పెద్దలు అభినందించారు.

బీజేపీలో చేరిక

తొర్రూరు రూరల్ : డివిజన్ కేంద్రంలోని ఆయా పార్టీలకు చెందిన, బేడబుడిగ జంగాల సంఘానికి చెందిన నాయకులు, కార్యకర్తలు రాజస్తాన్ రాష్ట్ర సీఎం భజన్‌లాల్ శర్మ, బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్, రాష్ట్ర నాయకుడు మార్తినేని ధర్మారావు, లేగ రాంమోహన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.

'కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు'



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో ఝాన్సీరెడ్డి

పెద్దవంగర : కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పెద్దవంగర మండల కేంద్రానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో ఝాన్సీరెడ్డి సమక్షంలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఖాళీ అయిందని, మతోన్మాద బీజేపీని ప్రజలు ఆదరించడంలేదని పేర్కొన్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో చేతిగుర్తుకు ఓటు వేసి వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ నాయకులు ముత్యాల పూర్ణచందర్, అనపురం శ్రీనివాస్ గౌడ్, సల్టెండి సుధాకర్, గద్దల ఉప్పలయ్య, శ్రీరాం జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

తొర్రూరు రూరల్ : పార్లమెంట్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించి కేంద్రంలో అధికారంలోకి తీసుకు వచ్చి డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే మరింత అభివృద్ధి చెందుతుందని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని గుర్తూరు, సోమారం గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్నికల్లో భారీ మెజార్టీని ఇచ్చి గెలిపించారని, అదే స్ఫూర్తితో మరోసారి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు హమ్యానాయక్, సుంచు సంతోష్, హరిప్రసాద్‌రావు, విశేశ్వర్‌రావు, ఎండీ యాకూబ్, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి

మహబూబాబాద్ అర్బన్ : ఓటు హక్కును ప్రతీ ఒక్కరు వినియోగించుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ సూచించారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య బైక్ యాత్రతో ప్రజలను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడారు. తెలంగాణలో ఓటరు బైకు చైతన్య యాత్రను గురువారం ప్రారంభించమన్నారు. ఈ యాత్ర ఉమ్మడి వరంగల్, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చేపడతామన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ పటిష్ఠంగా ఉంటాలంటే ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఓటు హక్కు ప్రాధాన్యతపై రచించిన పోస్టర్లు, కరపత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంజయ్య

తొర్రూరు : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ తూర్పాటి చిన్న అంజయ్య అన్నారు. డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఆలస్యంగా హాజరయ్యారు. ఎంపీటీసీలు సమావేశంపై ఆసక్తి చూపకపోగా కేవలం సంతకాలకే పరిమితమయ్యారు. మండల సభ మొక్కుబడిగా కాకుండా ప్రజా సమస్యల పరిష్కార దిశగా సాగాలని వైస్ ఎంపీపీ శ్యామ్‌సుందర్‌రెడ్డి పేర్కొన్నారు. గతంలో జరిగిన పనులపై సమీక్ష నిర్వహించి సమావేశాన్ని ముగించారు. ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలకు ప్రాధాన్యమివ్వాలని ఎంపీపీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ గౌస్, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోరం లేక మండల సభ వాయిదా

నెల్లికుదురు : ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సభ కోరం లేకపోవడంతో సభ్యుల సూచనల మేరకు వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి ప్రకటించారు.

ఆలస్యం ఎమ్మెల్యేతో.. అభివృద్ధి ఎలా?

- మాజీ మంత్రి సత్యవతిరాథోడ్



మాట్లాడుతున్న సత్యవతిరాథోడ్

డోర్నకల్ : డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రతీ కార్యక్రమానికి ఆరు గంటలు ఆలస్యంగా హాజరవుతారని, ఇలాంటి ఎమ్మెల్యేతో అభివృద్ధి ఎలా సాధ్యమని మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని కోరుతూ డోర్నకల్ పట్టణంలో భారీ రోడ్ షో నిర్వహించారు. సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీని వీడుతున్న వారంతా పచ్చి అవకాశవాదులన్నారు. బీఆర్‌ఎస్ పార్లమెంటు అభ్యర్థి కవిత మాట్లాడుతూ కాంగ్రెస్ మాయల హామీలను నమ్మి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఓట్లేసి మోసపోయారన్నారు. సమావేశంలో ఎంపీపీ ధరంసోత్ బాలునాయక్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కత్తెరసాల విద్యాసాగర్, మున్సిపల్ కౌన్సిలర్లు తేజావత్ సంధ్యారాణి, అంకెపాక అరుణ, కాలా మోనికాజైన్, కొత్త రాధిక, హేమచంద్రశేఖర్, బోరగళ్ల శరత్, పోటు జనార్దన్, వీరన్న, పీఏసీఎస్ చైర్మన్ భిక్షంరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే రైతులకు మేలు
డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

మరిపెడ రూరల్ : బీఆర్‌ఎస్‌తోనే రైతులకు అన్ని విధాలుగా మేలు జరిగిందని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఎంపీ కవితను గెలిపించాలని మరిపెడ మండలం బాల్నిధర్మారం, లచ్చతండా, ఎడ్జెర్ల, గుర్రప్పతండా, తండధర్మారం, వీరారం, అబ్బాయిపాలెం, ధరావత్‌తండా, గాలివారిగూడెం, ఎల్లారిగూడెం తదితర గ్రామాల్లో గురువారం రెడ్యానాయక్ ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశంలో రెడ్యానాయక్ మాట్లాడారు.

ఎంపీగా కవితను గెలిపించండి

కేసముద్రం : బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితను గెలిపించాలని మాజీ సర్పంచ్ పురం రాజమణి అన్నారు. గురువారం మండలంలోని అమీనాపురంలో ఉపాధి పనుల వద్ద బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌తోనే సముచిత న్యాయం

నెల్లికుదురు : బీఆర్‌ఎస్ పార్టీతోనే బడుగు,బలహీన వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని ఆపార్టీ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని వస్రాం తండా తదితర గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. నాయకులు బాలాజీ, భీక్కు నాయక్, వెంకటేశ్వరరెడ్డి, రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా మాలోత్ కవితను గెలిపించాలి

గూడూరు : మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను అధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర నాయకుడు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి కోరారు. మండలంలోని నాయకపల్లిలో గురువారం ఆయన ఉపాధి పనుల వద్ద ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరె వీరన్న, మోహన్‌రెడ్డి,బండారి వెంకన్న, యాదగిరి, వెంకటనర్సు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్



కురవి: మాట్లాడుతున్న రాంచంద్రునాయక్



ఇనుగుర్తిలో మాట్లాడుతున్న మురళీనాయక్

కురవి : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచంద్రునాయక్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మొగిలిచర్ల, నారాయణపురం, రాజోలు, బలపాల, లింగ్యాతండా, హరిదాసుతండా, కంచర్లగూడెం, పోలంపల్లి తండా, స్టేషన్ గుండ్రాతిమడుగు, బంచరాయి తండా, కొత్తూరు(జీ), పిల్లిగుండ్ల తండా, తాట్యతండా, పెద్ద తండా, గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామంలో ఎన్నికల సన్నాహక సమావేశాలు నిర్వహించారు.

రాహుల్ గాంధీ ప్రధాని అయితేనే కులగణన: ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్

నెల్లికుదురు / గూడూరు : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని, రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే కులగణన చేపట్టి కులాల వారిగా న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ అన్నారు. ఇనుగుర్తి మండలం చిన్న నాగారం, మీట్యాతండా గ్రామాలో, గూడూరు మండలంలోని బొల్లెపల్లి, రాజనపల్లి, చిర్రకుంటతండాలో గురువారం ప్రచారం నిర్వహించారు. కాగా నెల్లికుదురు మంలడంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామంలో పానుగోటి రామారావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

పెట్టుబడిదారులకు బీజేపీ ఊడిగం..

డోర్నకల్ : బీజేపీ సర్కార్ ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్‌పరం చేస్తూ పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బ వెంకటరెడ్డి తెలిపారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం బలరాం నాయక్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు.

మతతత్వ బీజేపీని ఓడించాలి

మహబూబాబాద్ రూరల్ : మతతత్వ బీజేపీని ఓడించి, ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బలరాంనాయక్ గెలిపించాలని మహబూబాబాద్ మండలంలోని రేగడి తండా, టేకుల తండాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ గురువారం ప్రచారం నిర్వహించారు. వీఎస్.లక్ష్మీపురంలో, జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో మండలంలోని సంద్రాల గూడెం గ్రామంలో గురువారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కుర్ర మహేష్ ప్రచారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ అన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ పోతురాజు రాజు ప్రచారం చేశారు.

సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రచారం

నెహ్రూసెంటర్ : సీపీఐ బలపర్చిన మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను గెలిపించాలని ఆ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 22, 27 వార్డుల్లో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

గార్ల మండలంలో..

గార్ల : మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి ప్రజలను కోరారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మద్దివంచలో సీపీఐ నాయకులు ప్రచారం నిర్వహించారు.

'ఎన్డీ అభ్యర్థి మురళీకృష్ణను గెలిపించాలి'



సత్యనారాయణపురంలో ప్రచారం చేస్తున్న సక్రు

నెహ్రూసెంటర్ : ప్రజాసమస్యలు, హక్కుల సాధనకు ఉద్యమాలు నిర్వహించే సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరి మధు అన్నారు. ఎన్డీ అభ్యర్థి గెలుపును కాంక్షిస్తూ జిల్లా కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజా ఉద్యమాలకు ఓటు వేయండని, దోపిడీ పాలనకు బుద్ధిచెప్పాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రశ్నిస్తున్న మేధావులనపై కేసులు బనాయిస్తూ జైళ్లకు పంపిస్తున్నారని ఆరోపించారు. ఎన్డీ ఉమ్మడి అభ్యర్థి మురళీకృష్ణను గెలిపించాలని కోరారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గోవర్ధన్, మురళీకృష్ణ, రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి గొని ఐలయ్య, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి, హెచ్.లింగ్యానాయక్, సామ పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

మురళీకృష్ణను గెలిపించాలని ప్రచారం

గార్ల : మహబూబాబాద్ పార్లమెంట్ న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని గురువారం ఆపార్టీ మండల కార్యదర్శి జి.సక్రు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండలంలోని సత్యనారాయణపురం, ముల్కనూరు గ్రామపంచాయతీల్లో ఆయన ఇంటింటి ప్రచారం చేస్తూ కుండ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పి.వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, సుధాకర్, రాధమ్మ, శ్రీను, పాల్గొన్నారు.

కురవి : పార్లమెంట్ ఎన్నికల్లో ఫాసిస్టు, మతోన్మాద బీజేపీని ఓడించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని రాజోలులో పార్టీ ఎంపీ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని కోరుతూ ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీని బొందపెట్టాలన్నారు. పార్టీ డివిజన్ కార్యదర్శి హెచ్.లింగన్న, సామ పాపయ్య, ఎస్‌కె బాబన్న, పర్వత కోటేష్, గుగులోత్ కోబాల్, గంగుల మల్లేష్, ఎస్‌కె యాకూబ్, బి.వెంకన్న, సైదులు, రమేశ్, వరదయ్య, కృష్ణ, సైదమ్మ, ఆశానమ్మ, పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నర్సింహులపేట /చిన్నగూడూరు: చిన్నగూడూరు మండలంలోని మంగోరిగూడెం గ్రామానికి చెందిన సందీప్ (23) తన స్నేహితులతో కలిసి నర్సింహులపేట మండలంలోని బొజ్జన్నపేటలో ఇసుక ఎత్తేందుకు వచ్చాడు. కాగా ఇసుక రవాణా చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ మీది నుంచి సందీప్ కింద పడటంతో గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడికి భార్య శ్యామల, కుమారుడు ఉన్నారు. మృతుడి మామ గార్ల మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపారు.

పాముకాటుతో మహిళ..

మరిపెడ రూరల్ : పాము కాటుకు గురై ఓ మహిళ మృతి చెందిన సంఘటన మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరా కాలనీకి చెందిన వాడపల్లి వెంకటమ్మ (55) ప్లాస్టిక్ సమాను ఎరుకొని కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఈ క్రమంలోనే బుధవారం ప్లాస్టిక్ సమాను ఎరుకొని రాత్రి ఇంటికి వస్తున్న సమయంలో మార్గ మధ్యంలో పాము కాటు వేసింది. ఇంటికి వచ్చి స్పృహ కోల్పోయింది. వైద్యం అందిస్తున్న క్రమంలో ఆమె అప్పటికే మృతి చెందింది.

ఒకరి అరెస్ట్

నర్సింహులపేట : మండలంలోని రామన్నగూడెం శివారు ధన్‌సింగ్‌తండాకు చెందిన బాదావత్ కిషన్‌ను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. వివిధ స్టేషన్లలో 9 కేసులు నమోదయ్యాయని దీంతో క్రిమినల్ చర్యలకు పాల్పడటంతో తండాకు చెందిన లూనావత్ శ్రీను, తొర్రూర్‌కు చెందిన వెన్నం రవీందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు విచారణ చేసి కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

చర్య తీసుకోవాలి

తొర్రూరు రూరల్ : ఇంటి స్థలాన్ని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండలంలోని నాంచారీమడూరు గ్రామానికి చెందిన ఓ మూగ వ్యక్తి సంబంధిత అధికారులకు గురువారం ఫిర్యాదు చేశాడు. బాధితుడు బండారి గణేష్‌కు వారసత్వంగా వచ్చిన 200 గజాల ఇంటిస్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నాడు. అధికారులు న్యాయం చేయాలని కోరాడు.

భూ తగదాలో ముగ్గురికి ఏడాది జైలు

భూ తగదాలో ముగ్గురికి ఏడాదిపాటు జైలుశిక్ష విధించినట్లు తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి మట్ట సరిత గురువారం తీర్పు వెలువరించారు. మండలంలోని అరిపిరాలకు చెందిన వల్లపు లింగయ్య తన భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నారని ఫిర్యాదు చేశబూరు. విచారణ అనంతరం సంబంధిత కక్షిదారులు వల్లపు బుచ్చాలు, అమృతయ్య, శైలజకు ఏడాది పాటు జైలుశిక్ష విధించడంతోపాటు ఒక్కొక్కరి రూ.2,200ల చొప్పున జరిమానా విధించినట్లు జడ్జి సరిత తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మండలంలోని కర్కాల గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 12 క్వింటాల పీడీఎస్ బియ్యం స్వాధీనం చేసుకోని, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై జగదీష్ గురువారం తెలిపారు.

కాంగ్రెస్ కార్యకర్తల బాహాబాహీ

మండలంలోని మడిపెల్లి గ్రామంలో కొత్త, పాత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మధ్య గురువారం రాత్రి గొడవ జరిగింది. ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు నుంచే కాంగ్రెస్ పార్టీలో ఉంటున్న నాయకులు, కార్యకర్తలు, ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తల నడుమ అధిపత్య పోరులో భాగంగా గురువారం రాత్రి నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ఎదుటే ఇరువర్గాల నాయకులు, కార్యకర్తలు గొడవ పడి కొట్టుకున్నారు. ఈ గొడవలో తీవ్రంగా గాయపడిన కాంగ్రెస్ నాయకుడు సాయిమల్లును వెంటనే తొర్రూరులోని ఓ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి గొడవలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయిమల్లును పరామర్శించారు.

మానుకోటలో చోరీ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ కొత్త కలెక్టరేట్ సమీపంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో రెండు తులాల బంగారం, రూ.1.10 లక్షల నగదు అపహరణకు గురైంది. కొత్త కలెక్టరేట్ సమీపం జర్నలిస్టుల కాలనీలోని ఓ ఇంట్లో బానోత్ లక్ష్మా, చుక్కమ్మ దంపతులు నివాసముంటున్నారు. తమ బంధువుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో అతడిని చూసేందుకు గురువారం ఉదయం వెళ్లారు. రాత్రి ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండి, ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై కే.శివ, సీసీఎస్ సీఐ చంద్రమౌళి, సిబ్బంది ఘటనా స్థలిని సందర్శించారు. ఫింగర్ ప్రింట్స్ సిబ్బంది వేలిముద్రలు సేకరించింది. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని టౌన్ సీఐ దేవేందర్ తెలిపారు.

గడ్డివామి దగ్ధం



కేసముద్రం : ప్రమాదవశాత్తు నిప్పంటుకుని 4 ఎకరాల గడ్డివామి దగ్ధమైన సంఘటన ఇనుగుర్తి మండలం తారాసింగ్‌తండా జీపీ బావోజీ తండాలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన రైతు ఉమ్లా చెందిన గడ్డివామికి, కొంత దూరంలో మొక్కజొన్న చొప్పకు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించి గడ్డివామికి అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినప్పటికి గడ్డివామి దగ్ధమైంది.